మెయిన్

టీ-మీడియా

సామాజికం.. ప్రజల పక్షం...

GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

సంపుటి : 8
సంచిక : 230
పేజీలు : 3

ఆదివారం
22.03.2026

ఇరాన్ అధ్యక్షుడికి ప్రధాని మోదీ ఫోన్..

టి మీడియా ,మార్చి 21 , ఢిల్లీ బ్యూరో :

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శనివారం ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఈద్, నౌరూజ్ పండుగల శుభాకాంక్షలు తెలియజేస్తూ పశ్చిమ ఆసియాలో మారుతున్న పరిస్థితులపై చర్చించారు. “ఈ పండుగల కాలం ఆ ప్రాంతానికి శాంతి, స్థిరత్వం, అభివృద్ధి తీసుకురావాలని ఆశిస్తున్నాం” అని మోదీ పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో ఆ ప్రాంతంలో కీలక మౌలిక వసతులపై జరుగుతున్న దాడులపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. “ఈ దాడులు ప్రాంతీయ స్థిరత్వానికి ముప్పు కలిగిస్తున్నాయి. అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలపై కూడా ప్రభావం చూపుతున్నాయి” అని ఆయన స్పష్టం చేశారు.అంతేకాక, ప్రపంచ వాణిజ్యానికి కీలకమైన సముద్ర మార్గాల భద్రతపై మోదీ ప్రత్యేకంగా దృష్టి సారించారు. “నావిగేషన్ స్వేచ్ఛను కాపాడడం అత్యంత అవసరం. రవాణా మార్గాలు ఎప్పుడూ తెరిచి, భద్రంగా ఉండాలి” అని ఆయన అన్నారు.పశ్చిమ ఆసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ సంభాషణకు ప్రాధాన్యత ఏర్పడింది. ప్రాంతీయ శాంతి, ప్రపంచ వాణిజ్య రక్షణపై భారత్ తన ఆందోళనలను స్పష్టంగా వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.

ఇరాన్ మిస్సైల్ పరిధి 4వేల కిలో మీటర్లా..?





- డిగో గార్సియాపై దాడితో ఉలిక్కిపడ్డ ప్రపంచం
- ప్రకటించిన పరిధిని మించి ప్రయోగం

టీ మీడియా, మార్చి 21,ఢిల్లీ బ్యూరో : 4,000 కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాన్ని చేధించే ప్రయత్నం. ఇదే ఇప్పుడు అంతర్జాతీయ వేదికపై చర్చనీయాంశంగా మారింది. ఇప్పటి వరకు తన క్షిపణుల గరిష్ఠ పరిధి 2,000 కిలోమీటర్లేనని ప్రకటిస్తూ వచ్చిన ఇరాన్, హిందూ మహాసముద్రంలోని కీలక సైనిక స్థావరమైన డిగో గార్సియాను లక్ష్యంగా చేసుకోవడం ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

ఒకటి గాల్లోనే- మరొకటేమో

అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం, చాగోస్ దీవుల్లో ఉన్న అమెరికా– బ్రిటన్ సంయుక్త సైనిక స్థావరం డిగో గార్సియాపై ఇరాన్ రెండు మధ్యంతర శ్రేణి బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. అయితే ఈ దాడి పూర్తిగా విజయవంతం కాలేదు. ప్రయోగించిన క్షిపణుల్లో ఒకటి గాల్లోనే విఫలమవగా, మరొకదాన్ని అమెరికా యుద్ధనౌక సమర్థవంతంగా అడ్డుకున్నట్లు సమాచారం. దాడి లక్ష్యాన్ని చేరుకోకపోయినా, ఈ ఘటన ప్రాధాన్యం మాత్రం గణనీయంగా పెరిగింది.

2,000 కిలోమీటర్లకే పరిమితమని చెబుతున్నా!

కారణం– డిగో గార్సియా స్థావరం ఇరాన్ భూభాగం నుంచి సుమారు 4,000 కిలోమీటర్ల దూరంలో ఉండటం. ఇంతదూరంలో ఉన్న లక్ష్యాన్ని చేరుకునే ప్రయత్నం చేయడం ద్వారా ఇరాన్ ప్రకటించని క్షిపణి సామర్థ్యాలు ఉన్నాయనే అనుమానాలు బలపడుతున్నాయి. ఇరాన్ ఇప్పటి వరకు తన బాలిస్టిక్ క్షిపణుల గరిష్ఠ పరిధి 2,000 కిలోమీటర్లకే పరిమితమని అధికారికంగా చెబుతూ వచ్చింది. కానీ తాజా పరిణామాలు చూస్తుంటే, ఆ దేశం వాస్తవానికి మరింత దీర్ఘ శ్రేణి క్షిపణులను అభివృద్ధి చేసి ఉండవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా మధ్యంతర శ్రేణి బాలిస్టిక్ మిసైల్ల (×=దీవీ) స్థాయికి చేరువలో ఉన్న సాంకేతికతను పరీక్షించి ఉండవచ్చని అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రపంచంలోనే అత్యంత కీలక సైనిక స్థావరాల్లో ఒకటి

ఈ చర్య ద్వారా ఇరాన్ కేవలం సైనిక శక్తిని ప్రదర్శించడం మాత్రమే కాకుండా వ్యూహాత్మక సందేశాన్ని కూడా పంపింది. తమ అసలు సామర్థ్యాలపై స్పష్టత ఇవ్వకుండా ప్రత్యర్థి దేశాలను అనిశ్చితిలో ఉంచడం ద్వారా మానసిక ఒత్తిడి సృష్టించడమే టెహ్రాన్ లక్ష్యంగా కనిపిస్తోంది. హిందూ మహాసముద్రంలోని చాగోస్ దీవుల్లో ఉన్న డిగో గార్సియా ప్రపంచంలోనే అత్యంత కీలక సైనిక స్థావరాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. అమెరికా గ్లోబల్ సైనిక కార్యకలాపాలకు ప్రధాన కేంద్రంగా పనిచేస్తోంది. ముఖ్యంగా అఫ్గానిస్తాన్, ఇరాక్ యుద్ధాల సమయంలో ఆ స్థావరం నుంచి బాంబింగ్ దాడులు నిర్వహించబడ్డాయి. భారీ బాంబర్లు, గూఢచారి విమానాలు ఇక్కడ స్థావరంగా ఉండడం వల్ల దీని ప్రాధాన్యం మరింత పెరిగింది.

మిగతా 3లో..

రెడ్ లైన్ దాడితే

తీవ్ర పరిణామాలు తప్పవ్

ట్రంప్‌నకు ఇరాన్ హెచ్చరిక

టి మీడియా ,మార్చి 21 , ఢిల్లీ బ్యూరో :

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత తీవ్రరూపం దాల్చుతున్న వేళ ఇరాన్?, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్?నకు హెచ్చరికలు జారీ చేసింది. తమ భూభాగంపై ఎలాంటి భూతల దాడులకు పాల్పడవద్దని హెచ్చరించింది. భూతల దాడి అనేది తమ 'రెడ్? లైన్'? అని, ఒకవేళ ట్రంప్ దానిని దాటే ప్రయత్నం చేస్తే, ఆయనకు ఊహించని సర్?ప్రైజ్? ఎదురవుతుందని స్పష్టం చేసింది.ఇరాన్?పై భూతల దాడులు చేసే అవకాశం ఉందని అమెరికా సంకేతాలు ఇచ్చిన నేపథ్యంలో, ఇరాన్? మిలిటరీకి చెందిన ఓ అధికారి ఈ కీలక వ్యాఖ్యలు చేసినట్లు శనివారం తస్నిమ్ న్యూస్ ఏజెన్సీ పేర్కొంది. "ఇరాన్?పై భూతల దాడి చేయడాన్ని మేము రెడ్? లైన్?ను క్రాస్ చేసినట్లు భావిస్తాం. గతంలో మా శత్రువుల ప్రతి చర్యకు మేము ఎలా అయితే షాక్ ఇచ్చామో, ఈ విషయంలోనూ అదే పునరావృతమవుతుంది" అని సదరు మిలటరీ అధికారి పేర్కొన్నారు.తస్నిమ్ న్యూస్ ఏజెన్సీ ప్రకారం, గతంలో ఇరాన్ ఇంధన మౌలిక సదుపాయాలపై ఇజ్రాయెల్?, అమెరికాలు దాడి చేసినప్పుడు, మొత్తం ఈ ప్రాంతంలోని ఇంధన కేంద్రాలు ఎలా నిలిచిపోయాయో ఆయన గుర్తు చేశారు. "మా ఇంధన వ్యవస్థపై దాడి జరిగినప్పుడు, ఈ ప్రాంతంలోని అన్ని ఇంధన వ్యవస్థలు స్తంభించిపోయాయి. ఈసారి కూడా మేము సిద్ధంగా ఉన్నాం. ఒకవేళ ఉగ్రవాది ట్రంప్? ఈ విషయంలో ఏదైనా తప్పు చేస్తే, తన సైనికుల శవపేటికలను కూడా మా గడ్డ నుంచి తీసుకెళ్లలేనంతగా ఆయనకు పెద్ద సర్?ప్రైజ్? ఇస్తాము" అని తస్నిమ్? న్యూస్ ఏజెన్సీతో సదరు అధికారి చెప్పారు.

విధ్వంసం సృష్టిస్తాం

'ఒకవేళ అమెరికా బరితెగించి, ఇరాన్ దీవులను ధ్వంసం చేయాలని చూస్తే, అది యునైటెడ్? అరబ్? ఎమిరేట్స్? (యూఏఈ) తీర ప్రాంతాల విధ్వంసానికి దారితీస్తుంది. అంతేకాదు దుబాయ్?, అబుదాబిలు మాత్రమే కాదు, అమెరికాకు ఆశ్రయమిచ్చే దేశాలన్నింటినీ లక్ష్యం చేసుకునే అవకాశం ఉంటుంది' అని సదరు సైనికాధికారి పేర్కొన్నారు.

ట్రంప్ లక్ష్యం అదే

మరోవైపు, ఇరాన్? అణ్వాయుధ సామగ్రిని (న్యూక్లియర్ మెటీరియల్?) స్వాధీనం చేసుకునేందుకు ఉన్న అన్ని మార్గాలపై ట్రంప్ యంత్రాంగ్ వ్యూహరచన చేస్తోందని సీబీఎస్? న్యూస్ శుక్రవారం పేర్కొంది. అయితే ఆ ఆపరేషన్? ఎప్పుడు ఉంటుందనే దానిపై ట్రంప్ ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని సమాచారం. అయితే ఈ ఆపరేషన్ కోసం అమెరికాలోని అత్యంత రహస్యమైన, తెలివైన, సమర్థవంతమైన? 'జాయింట్? స్పెషల్ ఆపరేషన్స్? కమాండ్?' (జేఎస్?ఓసీ) దళాలను మోహరించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

సీజ్‌ఫైర్ కోరుకోవడం లేదు

ఇరాన్?తో యుద్ధం మరింత తీవ్రమవుతున్న వేళ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. "యూఎస్? కాల్పుల విరమణ (సీజ్?ఫైర్?) కోరుకోవడం లేదని స్పష్టం చేశారు. మనం చర్చలు జరపవచ్చు. కానీ నాకు కాల్పుల విరమణ ఇష్టం లేదు. అవతలి పక్షం పూర్తిగా నాశనమవుతున్న తరుణంలో, మేము కాల్పుల విరమణ కోసం చూడడం లేదు" అని పేర్కొన్నారు.

ఇరాన్ చమురుపై ఆంక్షలు ఎత్తివేత

మరోవైపు, ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న క్రూడ్ ఆయిల్ ధరలను నియంత్రించేందుకు అమెరికా కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ చమురుపై ఉన్న ఆంక్షలను ఒక నెలపాటు తాత్కాలికంగా ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ తాత్కాలిక సడలింపు శుక్రవారం నుంచి అమల్లోకి వచ్చి ఏప్రిల్ 19 వరకు ఉంటుంది. హర్ముజ్? వద్ద ఉద్రిక్తతల కారణంగా గ్లోబల్ ఇంధన సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. దీనితో ప్రస్తుతం తన వద్ద నిల్వ ఉన్న చమురును ఇరాన్? విడుదల చేయడం ద్వారా సుమారు 140 మిలియన్ బ్యారెల్స్ చమురు గ్లోబల్ మార్కెట్‌లోకి వచ్చే అవకాశముంది. దీంతో సరఫరా ఒత్తిడి తగ్గి ధరలు స్థిరపడే అవకాశం ఉంది.

బీజేపీకి కాంగ్రెస్ 'బి-టీమ్'

రాహుల్ గాంధీపై కేరళ సీఎం విమర్శలు

టీ మీడియా, మార్చి 21,త్రివేండ్రం:

అసెంబ్లీ ఎన్నికల వేళ కేరళలో మాటల యుద్ధం నడుస్తోంది. అధికార, ప్రతిపక్షాలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో రాష్ట్రంలో ఓ ఆసక్తికర పరిణామం జరిగింది. కాంగ్రెస్? అగ్రనేత రాహుల్? గాంధీపై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్? తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బీజేపీకి రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ 'బీ– టీమ్?'గా వ్యవహరిస్తోందని ఆరోపించారు. దేశవ్యాప్తంగా ప్రతిపక్ష నాయకులను కేంద్ర దర్యాప్తు సంస్థలు విచారిస్తున్నప్పటికీ, కేరళ సీఎం మాత్రం ఎందుకు విచారించడం లేదని ఇటీవల రాహుల్? గాంధీ ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలకు కౌంటర్?గా విజయన్ స్పందించారు. దేశవ్యాప్తంగా ఇండియా కూటమిలో కాంగ్రెస్, సీపీఎం భాగస్వామ్య పక్షాలుగా ఉన్నాయి. జాతీయస్థాయిలో బీజేపీకి వ్యతిరేకంగా కలిసి గొంతును వినిపిస్తున్న ఇండియా కూటమిలోని పార్టీలు ఇవి. అలాంటి రాజకీయ పక్షాలు బీజేపీకి 'బీ– టీమ్?' అంటూ ఒకరిపై ఒకరు దుమ్మెత్తిపోసుకోవడం గమనార్హం.శనివారం పీటీఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో విజయన్ కాంగ్రెస్, రాహుల్ గాంధీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ ఉనికిని కాపాడుకోవడానికి బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని విజయన్ అన్నారు. కాంగ్రెస్ నేతలు అనుసరిస్తున్న విధానాలు బీజేపీకి లబ్ధి చేకూర్చేలా ఉన్నాయని, అందుకే వారిని బీజేపీకి బీ–టీమ్ అని పిలవడంలో తప్పు లేదని విజయన్ అన్నారు. మైనార్టీల మద్దతును పొందేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆయన విమర్శించారు. కానీ ఎల్‌డీఎఫ్ మాత్రం మతపరమైన ఓట్ల కోసం రాజీ పడబోమని ఆయన స్పష్టం చేశారు. మత సామరస్యాన్ని కాపాడటంలో తాము ఎప్పుడూ ముందుంటామన్నారు. సమాజంలో ఐక్యతను కాపాడడమే తమ ప్రభుత్వ ఏకైక లక్ష్యమన్నారు. మరోవైపు, విద్యా రంగంపై కూడా సీఎం పినరయి విజయన్ కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలోని విద్యా సంస్థల ప్రమాణాలను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు అనేక మార్పులు చేపట్టామని తెలిపారు.

అభివృద్ధి పథంలో నడిపించడమే లక్ష్యం

'ఎన్నికల మ్యానిఫెస్టో ఇప్పటికే తయారవుతోంది. విజన్ 2031 అనే పత్రానికి ఇప్పటికే ఆమోదం లభించింది. రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని వివిధ రంగాలు ఎలా అభివృద్ధి చెందాలి, ఎలా పురోగమించాలి అనే విషయాన్ని ఈ విజన్? వివరిస్తుంది. ఆధునిక కాలానికి తగిన విధంగా రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడమే మా లక్ష్యం. కేరళను ఉన్నత విద్యా కేంద్రంగా మార్చాలని 2021లోనే మేం ప్రతిజ్ఞ చేశాం. ఆ విషయంలో ఇప్పటికే గణనీయమైన మార్పులు జరిగాయి. అదేవిధంగా రాష్ట్రంలో పరిశోధనలను ప్రోత్సహిస్తున్నాం. ప్రజలు ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లడం మాకు ఇష్టం లేదు. వారి విద్య, అర్హతలకు అనుగుణంగా ఉద్యోగాలు ఇక్కడే అందుబాటులో ఉండాలి. అటువంటి అవకాశాలకు తగిన అభివృద్ధి ఇక్కడే జరగాలి. ఆ దిశగా మేం అడుగులు వేస్తున్నాం' అని విజయన్ పేర్కొన్నారు.

నిందితులను వదిలిపెట్టబోం

అదేవిధంగా, శబరిమల ఆలయానికి సంబంధించిన బంగారం మాయం వ్యవహారంపై కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ చేస్తున్న ఆరోపణలను ముఖ్యమంత్రి కొట్టిపారేశారు. ఈ కేసు ప్రస్తుతం కేరళ హైకోర్టు పర్యవేక్షణలో ఉందని, ఇప్పటివరకు దర్యాప్తులో ఎలాంటి లోపాలను కోర్టు కనుగొనలేదని ఆయన గుర్తు చేశారు. అదేవిధంగా, ఈ కేసులో ఎవరైనా తప్పు చేసినట్లు తేలితే వారిని కఠినంగా శిక్షిస్తామని సీఎం స్పష్టం చేశారు. ఈ అంశం రాబోయే అసెంబ్లీ ఎన్నికలపై ఎలాంటి ప్రభావం చూపదని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఏప్రిల్ 9న జరగనున్న ఎన్నికల్లో ప్రజలు తమ ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదిస్తారని విజయన్? ఆశాభావం వ్యక్తం చేశారు.ఇక కేంద్ర ప్రభుత్వంపై కూడా ఆయన విమర్శలు గుప్పించారు. ముఖ్యంగా వాయనాడ్ పునరావాసం కోసం అవసరమైన ఆర్థిక సహాయం విషయంలో కేంద్రం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని ఆరోపించారు. కేరళ రాష్ట్రానికి తగిన సహాయం అందించడం లేదని అన్నారు. మరోవైపు, కేంద్ర ప్రభుత్వం కేరళకు విస్తృత సహాయం చేసిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్ చేసిన వ్యాఖ్యలను కూడా సీఎం ఖండించారు.

తమిళనాడులో కొత్త రాజకీయ కూటమి..

చేతులు కలిపిన రామదాస్, శశికళ

టీ మీడియా, మార్చి 21,చెన్నై:

త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న తమిళనాడులో మరో కొత్త రాజకీయ కూటమి ఏర్పాటైంది. పట్టాలి మక్కల్ కచ్చి (పీఎంకే) వ్యవస్థాపకుడైన రామదాస్, దివంగత మాజీ సీఎం జయలలిత సన్నిహితురాలైన శశికళ దీని కోసం చేతులు కలిపారు. మొత్తం 234 నియోజకవర్గాల్లో అభ్యర్థులను నిలబెట్టాలని ఈ కూటమి యోచిస్తున్నది. విల్లుపురం జిల్లా తైలపురంలోని రామదాస్ నివాసానికి

మిగతా 3లో..

శ్రీవారి భక్తులకు కల్తీ లేని ఆహారం

- ఫుడ్ ల్యాబ్‌ను ప్రారంభించిన సీఎం చంద్రబాబు

టి మీడియా ,మార్చి 21 , తిరుమల

తిరుమల శ్రీవారి చెంతకు వచ్చే భక్తులకు కల్తీ లేని నాణ్యమైన ఆహారం అందించేందుకు టీటీడీ ఏర్పాటు చేసిన వాటర్ అండ్ ఫుడ్ అనాలసిస్ లేబరేటరీని సీఎం చంద్రబాబు ప్రారంభించారు. నీరు, ఆహారపదార్థాలు, ముడి సరకుల నాణ్యతను ఇందులో పరీక్షిస్తారు. 12 వేల చదరపు అడుగుల్లో రెండంతస్తుల్లో దీన్ని నిర్మించారు. ఆధునిక యంత్రాలతో లేబరేటరీని తీర్చిదిద్దారు. ఓ పుణ్యక్షేత్రంలో ఇంతటి భారీ ఫుడ్ ల్యాబ్‌ను దేశంలోనే తొలిసారిగా ఏర్పాటు చేశారు.9 నెలల్లో ల్యాబ్ నిర్మాణం: పవిత్ర పుణ్యక్షేత్రం తిరుమలలో భక్తులకు అందించే ప్రసాదాల్లో కల్తీకి తావులేకుండా కూటమి ప్రభుత్వం, టీటీడీ కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాయి. 12 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ప్రత్యేక ఫుడ్ ల్యాబరేటరీని ఏర్పాటు చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం స్థలం కేటాయించగా కేంద్ర ప్రభుత్వం నిధులతో 9 నెలల వ్యవధిలో ఈ ల్యాబ్ నిర్మాణం పూర్తయింది. దాదాపు రూ. రూ.25 కోట్ల అంచనా వ్యయంతో అత్యంత ఆధునిక సౌకర్యాలతో ఈ ప్రయోగశాలను నిర్మించారు.శ్రీవారి లడ్డూ, అన్న ప్రసాదాలతో పాటు నెయ్యి, నూనె, పాలు వంటి ముడిసరకుల్లో కల్తీని సూక్ష్మస్థాయిలో పసిగట్టేలా ప్రయోగశాలలో ఆధునిక సాంకేతికతతో కూడిన యంత్రాలను ఏర్పాటు చేశారు. ల్యాబ్‌లో కెమికల్, మైక్రోబయాలజీ ఎనాలసిస్‌కు సంబంధించిన చిన్న, పెద్ద కలిపి సుమారు 50 రకాల యంత్రాలను రూ. 10 కోట్లు వెచ్చించి అమర్చారు. నెయ్యిలో జంతువుల కొవ్వు, వెజిటబుల్ ఆయిల్ వంటి పదార్థాలతో పాటు పాలు, నూనెల్లో రసాయన వ్యర్థాలు, భారలోహాలు వంటి అవశేషాలను ఈ యంత్రాలు సులువుగా గుర్తించగలవు. గరిష్ఠంగా ఒక నమూనాపై 50 రకాల పరీక్షలు చేసే సామర్థ్యం ఈ యంత్రాలకు ఉంది.

పెరుగుతున్న గ్యాస్ కష్టాలు

2లో..

పెరుగుతున్న గ్యాస్ కష్టాలు

ఏజెన్సీల వద్ద జనం బారులు

టీ మీడియా, మార్చి 21,ఆదిలాబాద్:

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వంట గ్యాస్ వినియోగదారులకు తిప్పలు తప్పటం లేదు. గ్యాసు కొరత లేదని అధికారులు చెబుతున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. గ్యాస్ డెలివరీ కోసం ఏజెన్సీ వద్ద వినియోగదారులు బారులు తీరుతున్నారు. కొన్నిచోట్ల నో స్టాక్ అంటూ బోర్డులు పెడుతుండటంతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారు.

ఏజెన్సీల వద్ద బారులు

గ్యాస్ కష్టాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో వంట గ్యాస్ కొరత తీవ్ర రూపం దాలుస్తోంది. పలుచోట్ల ఖాళీ సిలిండర్లతో వినియోగదారులు క్యూలు కట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. బుక్ చేసుకొన్న మూడు, నాలుగు రోజులకు కూడా గ్యాస్ సిలిండర్ డెలివరీ కాకపోవడంతో వినియోగదారులు ఏజెన్సీల వద్దకు పరుగులు తీస్తున్నారు. ఉదయం నుంచి గ్యాస్ కోసం పడిగాపులు కాస్తున్నా, సరిపడే గ్యాసు లేక చాలా మంది ఉట్టి చేతులతో వెనుదిరుగుతున్నారు.

స్టాక్ ఆలస్యమైనందు వల్లే ఇబ్బందులు

ఆదిలాబాద్‌లో ఉన్న 3 ఏజెన్సీల్లో ఒకటి మినహాయిస్తే మిగిలిన రెండు ఏజెన్సీలకు వచ్చే గ్యాసు వివరాలేవీ వెల్లడి కావటం లేదు.

నిర్మల్, మంచిర్యాల, ఆసిఫాబాద్ ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి. ఫోన్లలో డెలివరీ అయినట్లు సందేశం వచ్చిందని ఏజెన్సీని సంప్రదిస్తే వారు చెప్పే సమాధానంతో ప్రజలు అయోమయంలో పడుతున్నారు. ఏజెన్సీ నిర్వాహకులు వాటిని బ్లాక్ మార్కెట్?లో అమ్ముకుంటున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. అయితే నిర్వాహకుల నుంచి మాత్రం భిన్నమైన స్వరం వినిపిస్తోంది. స్టాక్ ఆలస్యమైనందున కొన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయని, స్టాక్ వస్తే అందరికీ గ్యాస్ సర్దుబాటు చేస్తామని వారు చెబుతున్నారు. గృహ వినియోగానికి సంబంధించిన వంట గ్యాసును కొంతమంది ఏజెన్సీ నిర్వాహకులు బ్లాక్‌లో అమ్ముకుంటున్నారన్న వాదన కస్టమర్లలో బలంగా వినిపిస్తోంది. అధికారులు దీనిపై దృష్టి సారించి, సామాన్యులకు మెరుగైన సేవలు అందించాలని కోరుతున్నారు.

ఇంకా ఎన్ని రోజులు వేచి చూడాలి

నాకు గ్యాస్? రాకుండానే డెలివరీ అయినట్లుగా సెల్?ఫోన్?లో మెసేజ్? వచ్చింది. ఇదే విషయం గ్యాస్? ఏజెన్సీ వారిని అడిగితే దానికి సాంకేతిక సమస్య ఉంది అని చెబుతున్నారు. మరో మార్గం లేక కట్టెల పొయ్యిపై వండుకుని తింటున్నాం. మేం పనులు చేసుకుంటూ బతికే వారం. గ్యాస్?కోసం మూడు రోజుల నుంచి లైన్లో ఉంటూనే ఉన్నాం. ఇలా ఎన్ని రోజులు నిలబడి ఉండాలి. అధికారులు చొరవ చూపాలని కోరుతున్నా' అని మరో వ్యక్తి వాపోయారు.

మొయినాబాద్ ఫామ్ హౌస్ కేసు

- కొనసాగుతున్న విచారణ

టీ మీడియా, మార్చి 21, హైదరాబాద్:

హైదరాబాద్: అసైన్డ్ భూమిపై ఫామ్ హౌస్ నిర్మాణం.. బయటపడిన నిజాలురెవెన్యూ విచారణలో సంచలన అంశాలులగ్జరీ కార్లు సీజ్.. విచారణ వేగవంతంఫామ్ హౌస్ సీజ్‌కు సిద్ధమవుతున్న అధికారులు : మొయినాబాద్ ఫామ్ హౌస్ కేసులో కొనసాగుతున్న విచారణ..మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి చెందిన మొయినాబాద్ ఫామ్ హౌస్ వ్యవహారం ఇప్పుడు పెను దుమారం రేపుతోంది. అజీజ్ నగర్‌లోని సర్వే నెంబర్ 177/33 పరిధిలో ఉన్న సుమారు 2.20 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన ఈ ఫామ్ హౌస్ పూర్తిగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ భూమిలో కట్టినట్లు రెవెన్యూ అధికారులు జరిపిన విచారణలో నిర్ధారణ అయ్యింది. 2006లో ఈ భూమి రోహిత్ రెడ్డి తండ్రి విఠల్ రెడ్డి పేరుతో రిజిస్ట్రేషన్ అయినట్లు రికార్డులు చెబుతున్నప్పటికీ, భూభారతి రికార్డుల ప్రకారం అది జంగయ్య అనే వ్యక్తి పేరు మీద ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అసలు ప్రభుత్వానికి చెందిన అసైన్డ్ భూమిపై రిజిస్ట్రేషన్ ఎలా జరిగిందనే అంశంపై ప్రస్తుతం రెవెన్యూ , పోలీస్ యంత్రాంగం లోతుగా ఆరా తీస్తోందిఈ అక్రమ నిర్మాణంపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేసిన రెవెన్యూ శాఖ, ఫామ్ హౌస్‌ను సీజ్ చేయాల్సిందిగా ఇప్పటికే అధికారులకు నివేదిక అందించింది. పోలీసుల విచారణలో భాగంగా ప్రస్తుతం ఈ ఫామ్ హౌస్ వారి కస్టడీలోనే ఉంది. అక్కడికి పార్టీ కోసం వచ్చిన వారి విలాసవంతమైన వాహనాలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం ఐదు లగ్జరీ కార్లను (డిఫెండర్, వోల్వో, ఫోక్స్ వ్యాగన్, బెంజ్, రేంజ్ రోవర్) సీజ్ చేసి, ఆ సమాచారాన్ని కోర్టుకు నివేదించారు. పార్టీకి హాజరైన వారు తమ వాహనాలను అక్కడే వదిలేసి వెళ్లడంతో పోలీసులు వాటిని సీజ్ చేసి విచారణను వేగవంతం చేశారు. త్వరలోనే ఈ ఫామ్ హౌస్ సీజ్ ప్రక్రియ పూర్తయ్యే అవకాశం కనిపిస్తోంది.

ఘనంగా "శశిర సింధూరం" పుస్తక ఆవిష్కరణ

కవి రెంటాల చిన్న హుస్సేన్‌కు పలువురు ప్రశంసలు

టీ మీడియా మార్చి 21, ఖమ్మం :

ఖమ్మం జిల్లా పరిషత్ కార్యాలయంలో శనివారం ప్రముఖ కవి రెంటాల చిన్న హుస్సేన్ రచించిన "శశిర సింధూరం" కవితా సంపుటి ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సాహిత్యాభిమానులు, కవులు, మేధావులు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమానికి ప్రధాన అతిథులుగా హాజరైన సాహిత్య ప్రముఖులు మాట్లాడుతూ.. చిన్న హుస్సేన్ గారి కవిత్వం సమాజంలోని భావోద్వేగాలు, అనుభవాలు, సామాజిక వాస్తవాలను ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. "శశిర సింధూరం" పుస్తకం ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రత్యేక గుర్తింపు పొందే అవకాశముందని వారు అభిప్రాయపడ్డారు.

ఈ సందర్భంగా రచయిత రెంటాల చిన్న హుస్సేన్ మాట్లాడుతూ... తన కవిత్వం వ్యక్తిగత అనుభవాలు, సమాజంలోని సంఘటనలు, భావోద్వేగాల సమ్మిళితమని తెలిపారు. పాఠకుల ఆదరణే తనకు పెద్ద బలం అని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు పుస్తకంలోని కవితలను విశ్లేషిస్తూ, రచయిత యొక్క భావవ్యక్తీకరణ, భాషా సరళి, సామాజిక స్పృహను కొనియాడారు. సభలో పలు కవితా పఠనాలు కూడా నిర్వహించబడడంతో వేదిక సాహిత్య వాతావరణంతో కళకళలాడింది. ఈ కార్యక్రమంలో రచయిత కుటుంబ సభ్యులు కూడా చురుకుగా పాల్గొన్నారు. ముఖ్యంగా ఆయన కుటుంబానికి చెందిన రెంటాల లక్ష్మయ్య, రెంటాల నాగరాజు, నితిన్ హాజరై కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమం నిర్వహణలో ఆయన కీలక పాత్ర పోషించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమం చివరలో అతిథులకు సన్మానాలు నిర్వహించి, రచయితకు అభినందనలు తెలియజేశారు. ఈ ఆవిష్కరణ సభ ఖమ్మం జిల్లా సాహిత్య వర్గాలలో మంచి చర్చనీయాంశంగా మారింది.

అంకెల గారడితో మభ్యపెట్టే ప్రయత్నం

టీ మీడియా, మార్చి 21, వనపర్తి బ్యూరో :

మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తన స్వగృహంలో పత్రికా సమావేశంలో మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్ ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేసిందని,రాష్ట్రాన్ని తిరోగమన దిశలో నెట్టే విధంగా ఈ బడ్జెట్ ఉందని ఎద్దవా చేశారు. ఆరు గ్యారంటీలు 11డిక్లరేషన్లు అన్ని మోసమేనని భారతదేశ చరిత్రలో ప్రజలను ఇంత దగాపురితంగా మోసం చేసే బడ్జెట్ నేను చూడలేదని దుయ్యబట్టారు.ఎన్నికల డిక్లరేషన్లో కాంగ్రెస్ ఇచ్చిన ఒక్క వాగ్దానం నిలుపు కోకుండా మహిళలను, వృద్ధులను, దివ్యాంగులను, విద్యార్థినులను,రైతులను,కార్మికులను,ఉపాధి కూలీలను, హరిజన,గిరిజన,బడుగు బలహీన,మైనార్టీ వర్గాలను మోసం చేసి చరిత్రలోకి ఎక్కిందని నిరంజన్ రెడ్డి ఆరోపించారు.ఈ సమావేశములో జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్,జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్,మాజీ ఎం.పి.పి కృష్ణా నాయక్, గంధం.పరంజ్యోతి,గోపాల్ పేట మండల అధ్యక్షులు బాలరాజు, పెబ్బేరు మండలం అధ్యక్షులు వసం.రాములు, కర్రెస్వామి,నాయకులు ధర్మా నాయక్,దేవర్ల.నరసింహ,నాగన్న యాదవ్,నారాయణ నాయక్, జోహెబ్ హుస్సేన్, మహేశ్వర్ రెడ్డి, చిట్యాల. రాము,వడ్డే. రమేష్ మంద.రాము,శంకర్ తదితరులు ఉన్నారు.

పిల్లలను కేంద్రీయ విద్యాలయంలో చేర్పించాలి

టీ మీడియా, మార్చి 21, వనపర్తి బ్యూరో :

నాగవరం శివార్ ప్రాంతంలో కొత్తగా కేంద్రీయ విద్యాలయం ప్రారంభించబడినది అని తెలియజేయడం ఆనందంగా ఉంది. ఈ విద్యాసంస్థలో ప్రస్తుత విద్యా సంవత్సరానికి బాలవాటిక--1, బాలవాటిక--2, బాలవాటిక--3 తరగతులు మరియు 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు ప్రవేశాలు అందుబాటులో ఉన్నాయి. బాలవాటిక (1--3) మరియు 1వ తరగతి కోసం అభ్యర్థనలు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే స్వీకరించ బడతాయి.దరఖాస్తు చేసుకునేందుకు ఈ లింక్‌ను వినియోగించాలి.https://admission.kvs.gov.in/screen/home 2వ, 3వ, 4వ, 5వ తరగతులు కోసం ప్రవేశాలు ఆఫ్‌లైన్‌లో నిర్వహించబడతాయి.ఆసక్తి గల తల్లిదండ్రులు/అభ్యర్థులు పాఠశాల తాత్కాలిక ప్రాంగణం (వైటీసి భవనం), నాగవరం శివార్, వనపర్తి వద్ద పని దినాలలో సంప్రదించాలి.తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ పిల్లలను కేంద్రీయ విద్యాలయంలో చేర్పించాలని కోరడమైనది.ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కె. దశరథ రామ్ 96528 07273కేంద్రీయ విద్యాలయంనాగవరం శివార్, వనపర్తి.

రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన చైర్మన్

టీ మీడియా, మార్చి 21,పెబ్బేరు:

శనివారం పెబ్బేరు పట్టణంలో పవిత్ర రంజాన్ మాసం ముగింపు సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులకు మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు క్రమశిక్షణ దానగుణం భక్తికి ప్రతిరూపమైన ఈ పండుగను అందరూ సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఆయన కోరారు మున్సిపల్ పక్కల ఉన్న ఈద్గా దగ్గర చైర్మన్ ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలతో భక్తిశ్రద్ధలతో గడిపిన ముస్లిం సోదరులందరికీ ఈ ఈద్-ఉల్-ఫితర్ పండుగ శుభప్రదం కావాలని ఆకాంక్షించారు. పట్టణంలో మతసామరస్యం వెల్లివిరియాలని, అల్లాహ్ ఆశీస్సులతో అందరి ఇళ్లలో వెలుగులు నిండాలని ఆయన ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పర్వీన్ షకీల్ తాటికొండ కృష్ణ భాగ్యలక్ష్మి శివ మార్కెట్ వైస్ చైర్మన్ విజయ వర్ధన్ రెడ్డి మార్కెట్ డైరెక్టర్ రామన్ గౌడు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎల్లారెడ్డి మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్ బుర్రమోని రాములు యాదవ్ కొంతం దయాకర్ రెడ్డి రణధీర్ రెడ్డి మన్యం రజక నరసింహ డైరెక్టర్ రాములు వినయ్ కటికల వినోదు తదితరులు పాల్గొన్నారు

తోటి విద్యార్థిని కాల్చి చంపిన మరో విద్యార్థి..

టీ మీడియా, మార్చి 21, వారణాసి:

కాలేజీ క్యాంపస్‌లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వ్యక్తిగత వివాదం కారణంగా ఓ విద్యార్థి తుపాకీతో మరో విద్యార్థిని కాల్చి చంపాడు. ఈ షాకింగ్ ఘటన శుక్రవారం (మార్చి 20) రాత్రి ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి కాలేజీ క్యాంపస్‌లో చోటు చేసుకుంది. మృతుడిని ఉదయ్ ప్రతాప్ కాలేజీలో బీఏ నాలుగో సెమిస్టర్ విద్యార్థి అయిన సూర్య ప్రతాప్ సింగ్ (23)గా గుర్తించారు. మృతుడు సోషల్ సైన్సెస్ ఫ్యాకల్టీ భవనంలోని ఒక కారిడార్‌లో శుక్రవారం ఉదయం 11 గంటలకు తోటి విద్యార్థి అయిన మంజీత్ చౌహాన్ కాల్చి చంపాడు. దాడి సమయంలో మంజీత్.. బాధితుడి తల, ఛాతీని లక్ష్యంగా చేసుకుని నాలుగు రౌండ్లు కాల్పులు జరిపాడు. అనంతరం ప్రహరీ గోడ దూకి, సమీపంలోని చెత్తకుండీలో పిస్టల్‌ను పారవేసి పారిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని తుపాకిని స్వాధీనం చేసుకున్నారు.తీవ్ర గాయాలతో కుప్పకూలిన సూర్య ప్రతాప్‌ను మొదట మల్దహియాలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. ఆ తర్వాత బీహెచ్‌యూ ట్రామా సెంటర్‌కు రిఫర్ చేశారు. దీంతో అక్కడికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. పోస్ట్‌మార్టం కేంద్రం వద్ద బాధితురాలి తండ్రి నిందితుడిని ఎన్‌కౌంటర్ చేసేంత వరకు అంత్యక్రియలు జరిపేందుకు వీలులేదని డిమాండ్ చేశాడు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో పోలీసులు సర్దిచెప్పారు. అనంతరం మృతదేహాన్ని శివపూర్‌లోని మృతుడి ఇంటికి తరలించారు.ఘాజీపూర్ జిల్లాకు చెందిన సూర్య ప్రతాప్ సింగ్ చదువుల కోసం వారణాసిలో నివసిస్తున్నాడు. అతడు చదువులో చురుకుగా ఉండే విద్యార్థి. అతడి తల్లిదండ్రులు రిషిదేవ్ సింగ్, కిరణ్ సింగ్‌లకు సూర్య ఏకైక కుమారుడు. సూర్యతోపాటు మరో ఇద్దరు కుమార్తెలు కూడా ఉన్నారు. తోటి విద్యార్థి అయిన మంజీత్ చౌహాన్‌తో సూర్యకు వ్యక్తిగత వివాదం ఉంది. దీంతో పగ పెంచుకున్న మంజీత్.. కాలేజీ క్యాంపస్‌లోనే సూర్యను గన్‌తో కాల్పులు జరిపాడు. ఈ ఘటన కాలేజీలో ఘర్షణలకు దారితీసింది. ఆగ్రహించిన విద్యార్థులు కాలేజీ మెయిన్ గేట్‌కు తాళం వేసి, ఆస్తులను ధ్వంసం చేశారు. పలు వాహనాలు ధ్వంసం చేశారు. ముగ్గురు ఉపాధ్యాయులపై దాడి జరగగా.. ఓ ఉపాధ్యాయుడికి తలకు గాయం కావడంతో అతడిని పోలీసుల రక్షణలో ఆసుపత్రికి తరలించారు. ఉద్రిక్తతలు పెరగడంతో భారీగా పోలీసు బలగాలను మోహరించారు. అధికారులు లోపల చిక్కుకున్న ఉపాధ్యాయులను, బోధనేతర సిబ్బందిని క్యాంపస్ నుంచి బయటకు తరలించారు. ఇద్దరు విద్యార్థుల మధ్య వ్యక్తిగత వివాదం కారణంగానే ఈ కాల్పులు జరిగాయని వారణాసి పోలీస్ కమిషనర్ మోహిత్ అగర్వాల్ తెలిపారు. పరారీలో ఉన్న నిందితుడి ఆచూకీ కోసం పోలీసులు సీసీటీవీ ఫుటేజీ పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఈ సంఘటన క్యాంపస్ భద్రతపై, ముఖ్యంగా కాలేజీలోకి తుపాకీని ఎలా తీసుకువచ్చారనే దానిపై తీవ్ర స్థాయిలో చర్చలు సాగుతున్నాయి.

పర్యవేక్షణ లోపం వల్లే నీటి ఎద్దడి

- వాకిటి శ్రీధర్ మాజీ వైస్ చైర్మన్

టీ మీడియా, మార్చి 21, వనపర్తి బ్యూరో :

గతములో ఎన్నడు లేనివిధంగా పట్టణములో మంచి నీటి ఎద్దడి నెలకొన్నదని వాకిటి.శ్రీధర్ ఆవేదన వ్యక్తం చేశారు మంచినీటి సరఫరా చేయలేకపోవడం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని దీనికి కారణం పాలకులు అధికారులు కారణమని ఆయన ఆరోపించారు. మాజీ మంత్రి రాబోవు 50ఏండ్ల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని కేవలం మంచి నీటి సదుపాయం కోసం నియోజకవర్గానికి 330కోట్లు నిధులు సాధించినారని అందులో పట్టణానికి 33కోట్లు కేటాయించడం జరిగిందని బి.ఆర్.ఎస్ హయాములో ఎన్నడు రాని నీటి ఎద్దడి ప్రస్తుతం ఎందుకు వస్తుందో అధికారులు చెప్పాలని డిమాండ్ చేశారు.కరెంట్ సరఫరా,లీకేజీ వంటి కుంటి సాకులు చెప్పకుండా ప్రజలకు 24గంటలు మంచి నీటి సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.ఎమ్మెల్యే నీటి సరఫరాపై సమీక్ష చేసి ప్రతిపక్ష కౌన్సిలర్స్ ను ఆహ్వానించకపోవడం దురదృష్టకరం అని అన్నారు.బి.ఆర్.ఎస్ ఆధ్వర్యములో మంచినీటి కోసం ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

తిరుమల భక్తులకు శుభవార్త..

- దర్శన టికెట్ల షెడ్యూల్ విడుదల..

టీ మీడియా, మార్చి 21, తిరుమల :

శ్రీవారి భక్తులకు అలర్ట్.. జూన్ నెలలో స్వామివారిని దర్శించుకోవాలనుకునే వారి కోసం టీటీడీ టికెట్ల విడుదలకు సంబంధించి కీలక ప్రకటన చేసింది. నేటి నుంచి వరుసగా వివిధ సేవా టికెట్లు, దర్శన స్లాట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి రానున్నాయి.ఏ రోజు ఏ టికెట్లు విడుదలవుతాయంటే..?నేడు (మార్చి 21):వర్చువల్ సేవలకు సంబంధించిన దర్శన కోటాను ఈరోజు మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ తన అధికారిక వెబ్‌సైట్‌లో విడుదల చేయనుంది.మార్చి 23వ తేదీ షెడ్యూల్..ఉదయం 10 గంటలకు: అంగ ప్రదక్షిణ టోకెన్లు.ఉదయం 11 గంటలకు: శ్రీవాణి ట్రస్ట్ దర్శన టికెట్లు. మధ్యాహ్నం 3 గంటలకు: వయోవృద్ధులు, దివ్యాంగులు , దీర్ఘకాలిక వ్యాధులున్న వారికి కేటాయించే ఉచిత ప్రత్యేక దర్శన కోటా విడుదల చేయనున్నారు. గాలి, నీరు సుంచే పెట్రోల్, డీజిల్ తయారీ.. ఏం టెక్నాలజీ గురూ..మార్చి 24వ తేదీ షెడ్యూల్..ఉదయం 10 గంటలకు: రూ. 300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు.మధ్యాహ్నం 3 గంటలకు: తిరుమల మరియు తిరుపతిలో గదుల బుకింగ్ కోటా టికెట్స్ విడుదల చేస్తారు.ఇప్పటికే మార్చి 20వ తేదీన సుప్రభాతం, తోమాల, అర్చన వంటి ఆర్జిత సేవలకు సంబంధించిన లక్కీ డిప్ కోటాను విడుదల చేశారు. భక్తులు టీటీడీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా తమకు కావాల్సిన టికెట్లను బుక్ చేసుకోవాలని అధికారులు సూచించారు.

జీవన్ రెడ్డికి బుజ్జగింపులు..

- నిర్ణయంలో మార్పులేదన్న నేత

టీ మీడియా, మార్చి 21,హైదరాబాద్:

అడ్లూరి లక్ష్మణ్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం జీవన్ రెడ్డిని బుజ్జగించేందుకు సమావేశమయ్యారు. గంటకు పైగా నిర్వహించారు. పార్టీలో గౌరవం దక్కడం లేదని మంత్రుల ముందు జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... జీవన్ రెడ్డిని కలవడానికే ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. జీవన్ రెడ్డి పద్దతిగల నాయకుడిగా నాలుగు దశాబ్దాలుగా పార్టీలో ఉన్నారని ఆయన వెల్లడించారు. పార్టీ కార్యకర్తలు, నాయకుల మనోభావాలను తెలియజేశారని వివరించారు. జీవన్ రెడ్డితో అనేక అంశాల గురించి చర్చించామని తెలిపారు. జీవన్ రెడ్డి ఆవేదనను పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తామని సూచించారు. మంత్రులతో సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన జీవన్ రెడ్డి తన నిర్ణయంలో మార్పులేదని ప్రకటించారు. పూర్తి వివరాలు రేపు వెల్లడిస్తానని జీవన్ రెడ్డి స్పష్టం చేశారు. అయితే జీవన్ రెడ్డి పార్టీకి రాజీనామా చేసి ఏ పార్టీలో చేరుతారు? అనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

మూడు రోజుల కిందట భార్య..

టూటౌన్ ఎస్సై ఆత్మహత్య

టి మీడియా ,మార్చి 21 , కరీంనగర్ :

కరీంనగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఎస్ఐగా పనిచేస్తున్న చంద్రశేఖర్ ఆత్మహత్య చేసుకున్నారు. చంద్రశేఖర్ భార్య దివ్య ఇటీవలే ఆత్మహత్యకు పాల్పడిన సంగతి తెలిసిందే. ఆమె అంత్యక్రియలకు అత్తగారిల్లు అయిన సీతంపేటకు ఎస్ఐ చంద్రశేఖర్ వచ్చారు. భార్య ఆత్మహత్య ఘటనతో తీవ్ర మనస్తాపానికి గురైన చంద్రశేఖర్ అత్తగారింట్లోనే బలవన్మరణానికి పాల్పడడం జిల్లా పోలీస్ శాఖలో విషాదాన్ని నింపింది. చంద్రశేఖర్ మృతదేహాన్ని జమ్మికుంట ప్రభుత్వాసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం సీతంపేటకు చెందిన దివ్య(30)కు 2016లో దేసు చంద్రశేఖర్‌తో వివాహమైంది. ప్రస్తుతం వీరు కరీంనగర్‌లోని హనుమాన్‌నగర్‌లో ఉంటుండగా.. చంద్రశేఖర్ టూటౌన్‌లో ఎస్సైగా పనిచేస్తున్నాడు. ఎస్ఐ చంద్రశేఖర్ దంపతులకు పది, ఆరేళ్ల వయస్సు గల ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా, దివ్య మృతికి చంద్రశేఖర్ కారణమని.. ఆమె అంత్యక్రియల సందర్భంగా ఎస్సైపై సీతంపేట గ్రామస్తులు దాడి చేశారు. ఆ సమయంలో ఆ దాడిని దివ్య తండ్రి అడ్డుకోవడం గమనార్హం.

యాదాద్రిలో భక్తుల రద్దీ

- ధర్మ దర్శనానికి మూడు గంటలు

టీ మీడియా, మార్చి 21,యాదాద్రి:

శని ఆదివారాలు వరుస సెలవులు రావడంతో యాదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలోభక్తుల రద్దీ పెరిగింది. ధర్మ దర్శనానికి మూడు గంటలు, ప్రత్యేక దర్శనానికి రెండు గంటల సమయం పడుతుందని ఆలయ అధికారులు ప్రకటించారు. కొండ కింద రింగ్ రోడ్డులో ఎటు చూసినా వాహనాలు నిలిచిపోయాయి, కొండపైన వాహన రద్దీ పెరగడంతో కొండపైకి వాహనాలను అనుమతించడం లేదని భక్తులు తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు కొండపైన ప్రత్యేక ఏర్పాటు చేశారు.

విద్యారంగానికి 15% బడ్జెట్ కేటాయించాలి

టీ మీడియా, మార్చి 21, వనపర్తి బ్యూరో :

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27సం.ర బడ్జెట్ కేటాయింపులో పిఆర్సీ ప్రస్తావన, పెండింగ్ బిల్లులకు నిధులు కేటాయించకపోవడం శోచనీయమని టీఎస్ యుటిఎఫ్ వనపర్తి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్ రవి ప్రసాద్ గౌడ్,డి కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం విడుదల చేసిన సంయుక్త ప్రకటన చేశారు.రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు నూతన ఎంప్లాయిస్ హెల్త్ స్కీం ప్రకటించడం,వాటికి బడ్జెట్ సైతం కేటాయించడం హర్షణీయమని, కానీ సమగ్ర శిక్ష సిబ్బంది గురించి ప్రస్తావించకపోవడం సరియైందికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్లో విద్యారంగానికి సంబంధించిన కొన్ని సానుకూల అంశాలను స్వాగతిస్తున్నామని, మొత్తంగా కేటాయింపులు అవసరానికి తక్కువగా ఉన్నాయని, విద్యారంగానికి బడ్జెట్ మరింత పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. పిఆర్సీ, మేలు చేయాలని,నాలుగు డిఏలు, పెండింగ్ బిల్లుల విడుదలకు చర్యలు తీసుకోవాలని ఎస్.రవిప్రసాద్, గౌడ్, డి.కృష్ణయ్య జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి డిమాండ్ చేశారు.

పనులే శాశ్వతం

• మంత్రి వాకిటి శ్రీహరి

టి మీడియా, మార్చి 21, అమరచింత:

పదవులు శాశ్వతం కాదని, మనం చేసిన అభివృద్ధి పనులే శాశ్వతమన్నారురాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి. మక్తల్ నియోజకవర్గం అమరచింత మున్సిపల్ పాలక మండలి సభ్యుల పదవీ బాధ్యతల స్వీకారోత్సవానికి ఆయన ముఖ్య అతిథి గా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి పేదలకు సంక్షేమ పథకాలు అందాలన్నారు.ప్రజల ఆశీర్వాదం తో ఎన్నికైన ప్రజా ప్రతినిధులు ప్రజా సేవకు పునరంకితం అవ్వాలని ఉద్భోటించారు. ప్రజలు మనపై ఉంచిన నమ్మకాన్ని ఓమ్ము చేయకుండా పని చేయాలని హితవు పలికారు.తాను అలుపెరగకుండా అభివృద్ధి కి కట్టుబడి పని చేస్తున్నానని రాజకీయాల్లో కింది స్థాయి నుండి వచ్చిన వ్యక్తిని అని,వాగ్దానం చేసిన పనులు పూర్తి చేసే బాధ్యత నాదన్నారు.ప్రజా ప్రభుత్వంలో ఇరిగేషన్, ఎడ్యుకేషన్ కు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు.బీడీ, చేనేత కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, అమరచింత మండలంలో కొత్త గోదాముల నిర్మాణాలు చేపట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు.వై ఎస్ రాజశేఖర్ రెడ్డి తర్వాత మళ్ళీ ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి హయాంలో పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అవుతున్నట్లు స్పష్టం చేశారు.మండలంలో ఇప్పుడు మంజూరు అయిన 450 ఇందిరమ్మ ఇళ్లు పూర్తైతే మరో 500 ఇండ్లు ఈ మండలానికి మంజూరు చేస్తామని మంత్రి వెల్లడించారు. పేద వాడి ఇంటి నిర్మాణానికి వ్యక్తిగతంగా నేను సహాయం చేస్తానని హామీనిచ్చారు. కొత్తగా ఎన్నికైన కౌన్సిలర్ లు మీ వార్డుల్లో పేద వాడికి ఇళ్ళు కట్టించినప్పుడే మీరు నాకిచ్చే గౌరవం అని మంత్రి పేర్కొన్నారు. అమరచింత మండలంలో తాగునీటి సమస్య తీర్చేందుకు వాటర్ ట్యాంకులు నిర్మిస్తున్నామ ని తెలియజేశారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగాసీసీ రోడ్లు,డ్రైనేజీ నిర్మాణాలను పూర్తి చేసి తీరుతామన్నారు.నాపై నమ్మకం ఉంచి గెలిపించిన అమరచింత మండల ప్రజలకు సేవ చేయడం గొప్ప అదృష్టం గా భావిస్తున్నానని మంత్రి శ్రీహరి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అమరచింత మున్సిపల్ చైర్ పర్సన్ జింక సువర్ణ, వైస్ చైర్ పర్సన్ రాధా అరుణ్, టీపీసీసీ కల్లు గీత సెల్ చైర్మన్ నాగరాజు గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి,మున్సిపల్ కమీషనర్ నూరుల్ నజీర్ తదితరులు పాల్గొన్నారు.

ఇరాన్ మిస్సైల్ పరిధి 4వేల కిలో మీటర్లా..?

శత్రువులు ఊహించిన దానికంటే ఎక్కువగా

అంతేకాకుండా, 9/11 దాడుల తర్వాత అమెరికా గూఢచారి సంస్థలు అత్యంత రహస్య కార్యకలాపాలకు కూడా ఈ కేంద్రాన్ని వినియోగించాయని ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో డిగో గార్సియాపై దాడి ప్రయత్నం జరగడం అంతర్జాతీయంగా పెద్ద పరిణామంగా భావిస్తున్నారు. ఇరాన్‌కు అనుబంధంగా భావించే వర్గాలు ఆ దాడిని కీలక ముందడుగుగా అభివర్ణిస్తున్నాయి. తమ క్షిపణి పరిధి శత్రువులు ఊహించిన దానికంటే ఎక్కువగా ఉందని సంకేతాలు ఇస్తున్నాయి. ఇది ప్రత్యర్థి దేశాలకు ఒక హెచ్చరికగా కూడా భావిస్తున్నారు.

ఈ పరిణామం అమెరికా, బ్రిటన్ దేశాల రక్షణ వ్యూహాలపై ప్రభావం చూపే అవకాశముంది. ఇప్పటి వరకు ప్రధానంగా గల్ఫ్ ప్రాంతంపై దృష్టి పెట్టిన ఈ దేశాలు, ఇకపై హిందూ మహాసముద్ర ప్రాంతంలో కూడా తమ రక్షణ వ్యవస్థలను బలోపేతం చేయాల్సిన అవసరం ఏర్పడింది. ముఖ్యంగా క్షిపణి నిరోధక వ్యవస్థలను మరింత విస్తరించే దిశగా చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఇక గల్ఫ్ దేశాలు, ఇజ్రాయెల్ వంటి దేశాలు కూడా ఈ పరిణామాన్ని ఆందోళనతో గమనిస్తున్నాయి. ఇరాన్ క్షిపణుల పరిధి నిజంగా పెరిగితే, యూరప్ దక్షిణ ప్రాంతాల వరకు కూడా అవి చేరే అవకాశం ఉందని భద్రతా వర్గాలు అంచనా వేస్తున్నాయి.

యుద్ధరంగం విస్తరిస్తోందనే సంకేతాలు

ఇటీవల జరిగిన మరో ఘటన కూడా ఈ ఉద్రిక్తతలను మరింత పెంచింది. హిందూ మహాసముద్రంలో జరిగిన దాడిలో ఇరాన్‌కు చెందిన యుద్ధనౌక మునిగిపోయినట్లు వచ్చిన వార్తలు ఉద్రిక్తతలకు దారితీశాయి. ఆ ఘటనకు ప్రతిస్పందనగానే డిగో గార్సియాను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ ఈ క్షిపణి ప్రయోగం చేసి ఉండవచ్చని భావిస్తున్నారు. మొత్తంగా చూస్తే, ఈ 4,000 కిలోమీటర్ల దాడి ప్రయత్నం యుద్ధరంగం విస్తరిస్తోందనే సంకేతాలను ఇస్తోంది. గల్ఫ్ ప్రాంతాన్ని దాటి హిందూ మహాసముద్రం వరకు ఉద్రిక్తతలు వ్యాపిస్తున్నాయి. ఇది ప్రపంచ వ్యూహాత్మక సమీకరణాల్లో కీలక మార్పులకు నాంది పలకవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధికి సన్మానం

టీ మీడియా, మార్చి 21, వనపర్తి బ్యూరో :

వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా కోళ్ల వెంకటేష్ ఎన్నికైన సందర్భంగా ప్రేమ్ టైలర్ షాప్ నందు శనివారం నానమోని మన్నెం కోళ్ల వెంకటేష్ కి శాలువాతో పూలమాలతో సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. కోళ్ల వెంకటేష్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఎస్సీ వర్గీకరణ పోరాట యోధుడు కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా నిలుస్తూ పార్టీ కోసం ఎంతో కృషి చేస్తారని నానమోని మన్నెం కొనియాడారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి, ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, జిల్లా అధ్యక్షుడు శివసేన రెడ్డి, ఆధ్వర్యంలో ఈ అవకాశం దక్కడం హర్షనీయమని. ఈ కార్యక్రమంలో ప్రేమ్ టైలర్ మన్యం, మండ్లదేవన్న నాయుడు, గంధం నాగరాజు, గోపాల్ పెట్ నాగరాజు రాజనగరం రాజేష్, అన్నారం మాజీ సర్పంచ్ గడ్డం రాములు. తదితరులు పాల్గొన్నారు

మతసామరస్యానికి ప్రతీక పండుగలు

• డా:సతీష్ యాదవ్

టీ మీడియా, మార్చి 21, వనపర్తి బ్యూరో :

రంజాన్ పండుగ సందర్భంగా ఈద్గా దగ్గరికి వెళ్లి ముస్లిం సోదరులకు అఖిలపక్ష ఐక్యవేదిక తరపున శుభాకాంక్షలు తెలపడం జరిగింది. వనపర్తి పట్టణంలో ఈద్గా దగ్గర ముస్లిం సోదరులు తమ ప్రార్థనలు ముగించుకున్న వెంటనే కలిసి పండగ సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ అఖిలపక్ష సభ్యుడైన టీ.జే.ఎస్ ప్రధాన కార్యదర్శి ఎండి షఫీ కి, అధ్యక్షుడు ఖాదర్ భాషకు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఎం. డి.అలీమ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అక్తర్ కి మైరూమా (శాలువా) తో సత్కరించి శుభాకాంక్షలు తెలపడం జరిగింది. కార్యక్రమంలో అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు డా" సతీష్ యాదవ్, బీఎస్పీ కంటెస్టెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి మైబుస్ , కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు కొత్తగొల్ల శంకర్, ఐక్యవేదిక నాయకుడు రామస్వామి, లోక్సత్తా రాష్ట్ర కమిటీ సభ్యులు సూగురు రాజ్ కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో మంటలు

• పూర్తిగా దగ్ధం

టి మీడియా ,మార్చి 21 , విజయనగరం :

ఏపీలోని విజయనగరం జిల్లాలో ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అగ్ని ప్రమాదానికి గురైంది.రామభద్రాపురం మండలం తారాపురం వద్ద బస్సులో నుంచి మంటలు చెలరేగాయి. దీంతో బస్సు పూర్తిగా దగ్ధమైంది. భువనేశ్వర్ నుంచి మల్కాన్‌గిరి వెళ్తుండగా వెనుక టైర్ పేలడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.బస్సు వెనుక టైర్ పేలి మంటలు అంటుకోవడంతో అప్రమత్తమైన డ్రైవర్.. వెంటనే ప్రయాణికులను దించేశాడు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఘటన సమయంలో బస్సులో మొత్తం 42 మంది ప్రయాణికులు ఉండగా.. ఎవరికీ ఏ గాయం కాలేదు. అయితే బస్సు మాత్రం పూర్తిగా దగ్ధమైంది. ప్రమాద సమయంలో ఒడిశాకు చెందిన ఒక ఎమ్మెల్యే కూడా ప్రయాణం చేస్తున్నట్లు సమాచారం.కాగా, బస్సు ప్రమాదం గురించి సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఇక పోలీసులు కూడా ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. ప్రయాణికులను ప్రత్యామ్నాయ మార్గాల్లో గమ్యస్థానాలకు పంపించేశారు.

ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు

• డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి

టీ మీడియా, మార్చి 21, వనపర్తి బ్యూరో :



రంజాన్ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి ముస్లిం సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలియజేశారు. వనపర్తి జిల్లా కేంద్రంలో మసీదులో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చిన్నారెడ్డి మాట్లాడుతూ భారతదేశం లౌకిక దేశమని దేశంలో హిందువుల పండుగ వచ్చిన, ముస్లింల పండుగ వచ్చిన, క్రిస్టియన్ల పండుగ వచ్చిన దేశ ప్రజలందరూ పండుగలను జరుపుకుంటారని అన్నారు.ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.అదే విధంగా షాద్ నగర్ నియోజకవర్గం కొందుర్గ్ మండలం శ్రీరంగాపురం గ్రామంలో కాంగ్రెస్ నాయకులు సాదిక్ ఆహ్వానం మేరకు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి రంజాన్ వేడుకలకు హాజరై ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో టీపిసిసి ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, వనపర్తి కాంగ్రెస్ నాయకులు ద్వార పోగు విజయ్ బాబు ,నందిమల్ల సందీప్, పెద్దమందడి మండల్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు, శ్రీరంగాపురం గ్రామ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

• కౌన్సిలర్ మురళి సాగర్

టీ మీడియా, మార్చి 21, వనపర్తి బ్యూరో :

వనపర్తి పట్టణంలోని 19వ వార్డుకు చెందిన బిఆర్ఎస్ కార్యకర్త జగదీష్ ప్రమాదవశాత్తు నల్ల చెరువులో పడి మృతి చెందారు . విషయం తెలుసుకున్న స్థానిక కౌన్సిలర్ సూగూరు మురళి సాగర్, కుటుంబ సభ్యులకు ఐదు వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. దగ్గరుండి దహన సంస్కారాలు చేయించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు సాకలి సత్యం సూగురు రాజు సాగర్ , నరసింహ, నరేందర్, రవి, ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

తమిళనాడులో కొత్త రాజకీయ కూటమి..

శశికళ వెల్లారు. కొత్త రాజకీయ కూటమి ఏర్పాటు గురించి సుమారు రెండు గంటల పాటు ఆయనతో చర్చించారు.కాగా, శశికళ సొంతంగా ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా పురచ్చి తలైవర్ మక్కల్ మున్నేట్ర కజగం (ఏఐపీటీఎంఎంకే)తో పొత్తు పెట్టుకుని ఎన్నికల్లో పోటీ చేసేందుకు తాము ఒప్పందం కుదుర్చుకున్నట్లు రామదాస్ తెలిపారు. 'ఈ పొత్తు ఇప్పటికే తమిళనాడులో బలమైన ప్రభావాన్ని చూపింది. పలువురు ప్రత్యర్థులను కలవరపరిచింది. మరిన్ని పార్టీలు మాతో చేరుతాయని భావిస్తున్నాం' అని మీడియాతో అన్నారు. మొత్తం 234 నియోజకవర్గాల్లో అభ్యర్థులను నిలబెట్టాలని తమ కూటమి యోచిస్తున్నదని వెల్లడించారు.మరోవైపు పీఎంకే వ్యవస్థాపకుడైన రామదాస్, ఆయన కుమారుడు అన్బుమణి రామదాస్ మధ్య పార్టీపై నియంత్రణ అంశంలో విభేదాలున్నాయి. అలాగే అన్నాడీఎంకేలో తన ప్రభావాన్ని తిరిగి పొందడానికి శశికళ పోరాడుతున్నారు. పార్టీని ఏకం చేయడంలో విఫలమైన తర్వాత తన సొంత పార్టీ ఏఐపీటీఎంఎంకేను ఆమె ఏర్పాటు చేశారు.అయితే తమ మాతృ పార్టీల్లో అంతర్గత సవాళ్లను ఎందుర్కొంటున్న రామదాస్, శశికళ రాజకీయ ప్రాబల్యం పునరుద్ధరణ, తమ క్యాడర్‌ను పటిష్టం చేసుకోవడానికి ఈ పొత్తును ఒక మార్గంగా భావిస్తున్నారు. దీంతో వీరిద్దరూ కలిసి కొత్త రాజకీయ కూటమిని ఏర్పాటు చేశారు. కాగా, తమిళనాడులో ఏప్రిల్ 23న ఒకే విడతలో పోలింగ్ జరుగనున్నది.

కాంగ్రెస్ లో చేరిన బి ఆర్ ఎస్ వార్డు సభ్యులు

టీ మీడియా, మార్చి 21,పెబ్బేరు: శనివారం పెబ్బేరు మండలంలోని పాత పల్లి గ్రామానికి చెందిన 2వ వార్డు సభ్యురాలు కవిత 4వ వార్డ్ సభ్యురాలు ఉషనమ్మ మాజీ సర్పంచ్ పి రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి వనపర్తి లోనీ నంది హిల్స్ లో గల తన నివాస కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు ఈ సందర్భంగా వార్డు సభ్యులు మాట్లాడుతూ నేడు కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టి పేద ప్రజల అభ్యున్నతికి పాటుపడుతుందని కాంగ్రెస్ పార్టీ పథకాలకు పాలనకు ఆకర్షితులమై నేడు బి ఆర్ ఎస్ పార్టీ ని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు వారు చెప్పారు

వీరితో పాటు మరో 25 మంది బిఆర్ఎస్ కార్యకర్తలు నాయకులు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన కొనసాగిస్తుందని నేడు తెలంగాణ రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పథకాలు గ్రామ గ్రామాన నిరుపేదలకు అందుతున్నాయన్నారు కాంగ్రెస్ పాలనలో ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా జీవించవచ్చునని పార్టీలో చేరిన ప్రతి ఒక్కరు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు విలేజ్ ముత్త రాములు పాతపల్లి రవీందర్ వెంకటయ్య శ్రీరాములు చిరంజీవి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

సామాజిక సేవలో మల్లేశం

• సంఘాల సన్మానం

టి మీడియా,మార్చి 21, ధర్మారం:

మండల కేంద్రానికి చెందిన ప్రముఖ పాత్రికేయుడు, 'తెలంగాణ వాణి' ప్రతినిధి సుంచు మల్లేశంకు జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం లభించింది.సామాజిక సేవా రంగంలో ఆయన కనబరుస్తున్న ప్రతిభకు గుర్తింపుగా ఇటీవల ప్రతిష్టాత్మకమైన 'డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నేషనల్ అవార్డు' వరించింది. ఈ సందర్భంగా శనివారం ధర్మారం మండల కేంద్రంలో పాత్రికేయులు,దళిత సంఘాల నాయకులు ఆయనను శాల్వాలతో సత్కరించారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత మల్లేష్ మాట్లాడుతూ.."నా సేవలను గుర్తించి జాతీయ స్థాయి పురస్కారం అందించడం నా బాధ్యతను మరింత పెంచింది అని.భవిష్యత్తులోనూ సమాజ సేవలో,ప్రజా సమస్యల పరిష్కారంలో నా వంతు కృషి చేస్తానని అని అన్నారు.ఈ సన్మాన వేడుకలో:ఎండపల్లి మండలం: డీజేఫ్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గౌరి ప్రభాకర్,ఐజెయూ అధ్యక్షుడు నల్లల కుమార్,కొమ్మ స్వామి.దళిత సంఘాల నేతలు వడ్కపురం రవి,అశోక్, రేగుంట నర్సయ్య.మల్లాపూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు మెట్ పల్లి నరేష్,కాంపెల్లి తిరుపతి,కొత్తపేట వార్డు సభ్యులు నక్క యాదగిరి, బొల్లి నందయ్య,పాల్గొన్నారు.

మంత్రి వాకిటి పర్యటన

టీ మీడియా, మార్చి 21 ,ఆత్మకూరు :

పట్టణంలోని ముస్లిం సోదర సోదరీమణులకు రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక, యువజనుల సర్వీసుల, మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. మక్తల్ నియోజకవర్గం ఆత్మకూరు లో ఈద్గా వద్ద జరిగిన రంజాన్ వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం ముస్లిం సోదరులను అలింగనం చేసుకొని వారికి హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. అలాగే ఆత్మకూరు పట్టణంలో నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి ఇంటి పెద్దలకు చీర సారె అందించారు. మధ్యాహ్నం ఆత్మకూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ రహమత్ ఇంట్లో రంజాన్ దావత్ చేశారు. ఆత్మకూరు మండలం తిప్పడం పల్లి గ్రామంలో శివాజీ విగ్రహా ఆవిష్కరణ చేశారు. అనంతరం మేడపల్లి గ్రామంలో బిటి రోడ్డుకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మండల నాయకులు పురపాలకు సభ్యులు. వివిధ గ్రామాల నాయకులు కార్యకర్తలు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు

టీ మీడియా ,మార్చి 21, టేక్మాల్ ప్రతినిధి:

పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని టేక్మాల్ మండల కేంద్రంలో శనివారం మత సామరస్యం వెల్లివిరిసింది. మెదక్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు షేక్ మజహర్ టేక్మాల్‌ను సందర్శించి, స్థానిక ముస్లిం సోదరులను మర్యాదపూర్వకంగా కలిశారు (ములాఖత్). ఈ సందర్భంగా వారికి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో టేక్మాల్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ తిమ్మి సుధాకర్ , మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నిమ్మ రమేష్ పాల్గొని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు అందజేశారు. పండుగలు మనుషుల మధ్య ప్రేమను, ఐక్యతను పెంచాలని వారు ఆకాంక్షించారు.పాల్గొన్న ఇతర నాయకులుఈ కార్యక్రమంలో టేక్మాల్ మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు మణి కిషన్ , టేక్మాల్ మాజీ సర్పంచ్ పాపయ్య గారితో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ముస్లిం పెద్దలు, యువకులు ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులకు సాదర స్వాగతం పలికారు.

తీరిన నీటి కష్టాలు

టీ మీడియా, మార్చి 21, టేక్మాల్ ప్రతినిధి:టేక్మాల్ మేజర్ గ్రామ పంచాయితీ పరిధిలోని 10వ వార్డులో నెలకొన్న నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. వార్డు మెంబర్ లావణ్య బాలకృష్ణ తమ వార్డులోని ప్రజల ఇబ్బందులను గ్రామ సర్పంచ్ తిమ్మిగారి సుధాకర్ దృష్టికి తీసుకురాగా, వారు వెంటనే స్పందించి రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా వివరించారు. దీనిపై తక్షణమే స్పందించిన మంత్రి కాలనీలో నీటి కొరత తీర్చేందుకు వెంటనే బోరు వేయించాలని ఆదేశించారు.మంత్రి ఆదేశాల మేరకు శనివారం యుద్ధ ప్రాతిపదికన బోరు వేయడం జరిగింది. తమ సమస్యను త్వరితగతిన పరిష్కరించినందుకు కాలనీ వాసులు మంత్రి సర్పంచ్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు నిమ్మ రమేష్, సీనియర్ నాయకులు సుబేధర్ మాన్ కిషన్, డిసిసి జిల్లా సెక్రటరీ ఆశీల విద్యా సాగర్, ఉప సర్పంచ్ మేకలకాడి శంకరయ్య, మాజీ సర్పంచ్ ఆకులపల్లి పాపయ్య, టౌన్ అధ్యక్షులు భక్తుల కిషోర్, వార్డు మెంబర్లు నాగులపల్లి సదాశివ గౌడ్, సోలాపూర్ రాజు, కుమ్మరి ధనంజయ్, మరియు కాలనీ వాసులు బాజా సత్తయ్య, భోగం మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మృత్యువుతో పోరాడి రమ్య కన్నుమూత

టీ మీడియా,మార్చి 21,ధర్మపురి:జగిత్యాల జిల్లా ధర్మపురి మండల కేంద్రంలోని హరిజనవాడలో గత కొన్ని రోజుల క్రితం జరిగిన ఘోర కలికల సంఘటనలో బాధితురాలు మసీద్ రమ్య (22) శనివారం ఉదయం తుదిశ్వాస విడిచింది.భర్త చేతిలో సజీవ దహనానికి గురై, మృత్యువుతో పోరాడి ఓడిపోవడంతో స్థానికంగా విషాద ఛాయలు అలు ముకున్నాయి.

ధర్మపురి ఎస్సై జి మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మపురి పట్టణానికి చెందిన బడుగు నవీన్ (23), అదే గ్రామానికి చెందిన మసీదు రమ్య నాలుగేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. పెళ్లైన కొన్ని నెలల నుంచే వీరి మధ్య కలహాలు మొదలయ్యాయి. పలుమార్లు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీలు నిర్వహించినప్పటికీ నవీన్ ప్రవర్తనలో మార్పు రాలేదు.ఐదు నెలల క్రితం భార్యపై అనుమానం పెంచుకున్న నవీన్ ఆమెతో గొడవపడగా,రమ్య తన తల్లి రజిత వద్దకు వెళ్లిహరిజనవాడలో నివాసం ఉంటోంది.భార్య తనను వదిలి వెళ్ళిందనే కక్షతో ఈ నెల 16వ తేదీన నవీన్ పక్కా పథకం ప్రకారం రమ్య వద్దకు వెళ్లాడు.తన వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఆమెపై పోసి నిప్పు అంటించాడు.రమ్య కేకలు వేయడంతో స్థానికులు స్పందించి 108 అంబులెన్స్ ద్వారా మెరుగైనా వైద్యం కొరకు ఆమెను చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారుబాధితురాలి తల్లి రజిత ఫిర్యాదు మేరకు ధర్మపురి పోలీసులు కేసు నమోదు చేశారు.ఘాతుకానికి పాల్పడిన బడుగు నవీన్‌ను పోలీసులు ఇప్పటికే అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని రమ్య కుటుంబ సభ్యులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఎస్సై జి.మహేష్ కేసు దర్యాప్తును ముమ్మరం చేశారు.

రంజాన్ పండుగ వేడుకలు

టీ మీడియా మార్చి 21, టేక్మాల్ ప్రతినిధి:మెదక్ జిల్లా టేక్మాల్ మండలంలోనికుసంగి గ్రామ మైనార్టీ సోదరులకు గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ మరియు వార్డు సభ్యులు స్థానిక ఈద్గాలో రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు ప్రతి ఒక్కరినీ పేరు పేరునా పలకరిస్తూ, అలయ్ బలయ్ చేసుకుంటూ హృదయపూర్వక రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. పవిత్రమైన రంజాన్ మాసంలో నెల రోజులు ఉపవాసం ఉండి, ఈరోజు పండుగ జరుపుకుంటున్న ప్రతి ఒక్కరికీ శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో గ్రామ పంచాయితీ సర్పంచ్ కదులూరి సంగమేశ్వర్ గౌడ్, ఉప సర్పంచ్ సుబ్బారావు, వార్డు సభ్యులు వెంకట్ గౌడ్ మరియు తదితరులు పాల్గొన్నారు